ఉత్తమ పోలీస్ ఆఫీసర్‌గా రవితేజ

విశాలాంధ్ర - మామిడికుదురు : గుజరాత్‌లోని గాంధీనగర్ ఎస్పీగా పని చేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నంలంకకు చెందిన వాసంశెట్టి రవితేజ ఉత్తమ పోలీస్ ఆఫీసర్ అవార్డు అందుకున్నారు. గుజరాత్లోని గాంధీనగర్లో గురువారం జరిగిన సమావేశంలో రాష్ట్ర డీజీపీ వికాష్ సాహి రవితేజకు ఉత్తమ పోలీస్ ఆఫీసర్ అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందించారని రవితేజ తండ్రి హైకోర్టు న్యాయవాది వాసంశెట్టి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. రవితేజ గతంలో కూడా గుజరాత్ ఉప ముఖ్యమంత్రి నితిన్ భాయ్ పటేల్ చేతుల మీదుగా ఉత్తమ పోలీస్ ఆఫీసర్ అవార్డు అందుకున్నారు. 2015 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రవితేజ కోనసీమలోని మారుమూల గ్రామంలో పుట్టి పోలీస్ ఆఫీసర్‌గా గుజరాత్‌లో మన్ననలందుకుంటున్నారు. రవితేజ ఉత్తమ పోలీస్ ఆఫీసర్ అవార్డు అందుకోవడం పట్ల పలువురు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - అమలాపురం : జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు పెచెట్టి విజయలక్ష్మి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మాజీ ఎమ్మెల్యే అనందరావు క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా సాధికారత దిశగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మరో కీలక నిర్ణయం తీసుకుని 'కలలకు రెక్కలు' అనే పేరుతో ఓ సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకొచ్చారని విజయలక్ష్మి అన్నారు. నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గెల్లా మీనా కుమారి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఏ తెలుగింటి ఆడబిడ్డ కూడా నిధుల కొరత కారణంగా తమ కలలతో రాజీ పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వేగిరాజు వెంకట ప్రమీల, అప్పారి సుశీల, పేరూరి విజయలక్ష్మి, నిమ్మకాయల పద్మావతి, ముత్తా బత్తుల అరుణ, యనమదల లక్ష్మీ, బోడ సీత, కాండ్రేగుల వాణి అచ్యుతం, మట్టపర్తి భారతి, గుమ్మళ్ల నాగమణి, లక్కింశెట్టి సూర్యకుమారి, అంజలి తదితరులు మహిళలు పాల్గొన్నారు.

'వికాస' కార్యాలయంలో 11న జాబ్‌మేళ

విశాలాంధ్ర - కాకినాడ : వికాస కార్యాలయంలో ఈ నెల 11వ తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నారు. టాటా ఎలక్ట్రానిక్స్ (ఆపిల్ మొబైల్ మాన్యుఫాక్చరింగ్) ప్రై.లి. కంపెనీలో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, జిందాల్ ఎక్స్ కంపెనీలో బిపిఒ(వాయిస్ ప్రాసెస్, వోల్టాస్ కంపెనీలో టెక్నిషియన్, భారత్ ఫోర్జ్ కంపెనీలో టెక్నిషియన్, నిట్ (ఐసిఐసిఐ బ్యాంక్)లో రిలేషన్ షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ ట్రైనీ (ప్రొడక్షన్), డిక్సాన్ కంపెనీలో టెక్నిషియన్, డిడియుజికెవై స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ & బిటెక్ ఉత్తీర్ణులైన 35సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12,000 నుండి రూ.25,000 వరకు జీతం + భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 11వ తేదీ సోమవారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ" వద్ద ఉదయం 9 గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు సెల్: 7799376333 సంప్రదించవలెను.

వ్యక్తి అదృశ్యం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం ఎన్టీరాజాపురం గ్రామానికి చెందిన సవరపు ప్రకాష్ (27) కనిపించకపోవడంతో తన తల్లి(సవరపు మరియమ్మ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రకాష ఇంట్లో, తన భార్యతో గొడవ పడి ఫిబ్రవరి 28వ తేదీ బుధవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుండి ఇంట్లో వారు వెతకగా, అతని ఆచూకీ తెలియకపోవడంతో గండేపల్లి స్టేషన్లో తల్లి ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించినప్పుడే వారికి నిజమైన స్వాతంత్ర్యమని కార్మిక విద్యా శాఖ అధికారి రెడ్డి నాగార్జున అన్నారు. పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్, చైతన్య వాలంటరీ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ముమ్మిడివరం మండలం అయినాపురం కోమటి చెరువు గ్రామంలో జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సంస్థ అధ్యక్షులు టి. నాగరాజారావు అధ్యక్షతన సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లేబర్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రెడ్డి నాగార్జున మాట్లాడుతూ మహిళలు రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులను తెలుసుకోవాలన్నారు. ప్రస్తుత కాలంలో కుటుంబం నుంచి గాని సమాజం నుంచి గాని మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పుల్లపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలోని మహిళలందరూ సంఘటితమై రాజ్యాంగంలో వారికి ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో మహిళల కోసం ప్రత్యేక హక్కులు కల్పించాలని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా రంగాలలో విశిష్ట సేవలు అందించిన కే.రమాదేవి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల మమ్మిడివరం, జే సుజాత వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు అమలాపురం, పి రజిని మాత రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ అనాతవరం డి పద్మ మహిళా పోలీస్ కాట్రేనికోన, ఆయా రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలకు ఈ సందర్భంగా వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కె. వెంకటేశ్వరరావు, చైతన్య వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, ఎన్‌వివి సత్యనారాయణ, డి. నాగు, రోటరీ క్లబ్ కార్యదర్శి సతీష్, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకే ఉచిత మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం పట్టణంలో మహాశివరాత్రి సందర్భంగా పట్టణానికి విచ్చేసిన వేలాది భక్తులకు మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేసి, భక్తులకు ఉచిత మజ్జిగ పిఠాపురం నియోజకవర్గ జనసేన నాయకులు, శ్రీ విష్ణు హాస్పటల్ అధినేత డాక్టర్ పిల్లా శ్రీధర్ అందజేశారు. అనంతరం డాక్టర్ పిల్లా శ్రీధర్ మీడియాతో మాట్లాడుతూ శైవ క్షేత్రంగా పేరుగాంచిన పిఠాపురం పట్టణం మహాశివరాత్రి సందర్భంగా వేలాది భక్తులు ఇక్కడికి రావడం జరుగుతుందని, ప్రస్తుతం వాతావరణరీత్యా కాస్తున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు దాహార్తి తీర్చుటకు తన వంతు సహాయంగా మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ సర్పంచ్ గరగా సత్యానందరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ జ్యోతుల సతీష్, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది జోగేశ్వరరావు, జన సైనికులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల్లో

అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తే చర్యలు

విశాలాంధ్ర - పెద్దాపురం : మండలంలోని ఏ గ్రామంలోనైనా సంపద తయారీ కేంద్రాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఈడబ్ల్యూపీసీ రిసోర్స్ పర్సన్ జి. రాజ్ కుమార్ అన్నారు. మండలంలోని వడ్లమూరు. గోరింట, దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి గ్రామ పంచాయతీల్లోని సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శుక్రవారం ఆయన మండల విస్తరణాధికారి కె రాజశేఖర్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాల నిర్వహణలో పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా గ్రామాల సంపద తయారీ కేంద్రం వద్ద డంపింగ్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పంచాయతీ సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సత్వరమే డంపింగ్ చెత్త రోడ్డపై లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. షెడ్ నిర్మాణాలకు అవసరమైన నిధులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఈఓపీఆర్డి రాజశేఖర్ అన్నారు. వారి వెంట ఎఫ్ టీసీ టీఏ గణేష్, పంచాయతీ కార్యదర్శులు జ్యోతుల పద్మరాజు, కళ, బ్రహ్మం, లక్ష్మీదేవితో పాటు సచివాలయ కార్యదర్శిలు సిబ్బంది ఉన్నారు.

బలుసుతిప్పలో హరీష్, బుచ్చిబాబుకు బ్రహ్మరథం

విశాలాంధ్ర - అమలాపురం/కాట్రేనికోన : ముమ్మిడివరం నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాట్రేని కోన మండల బలుసు తిప్పలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వ హించిన తెలుగుదేశం పార్టీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి హరీష్ బాలయోగి-దాట్ల సుబ్బరాజులకు ప్రజలు బ్రహ్మరదం పట్టారు ప్రత్యేక బోటులో బలుసుతిప్ప వెళ్లిన హరీష్ బాలయోగి, దాట్ల బుచ్చిబాబులకు ఎదురేగి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గెలుపుతో ప్రజా ప్రభుత్వానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు తెలుగుదేశం-జనసేన ఉమ్మడి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు నియోజకవర్గంలోని కాట్రేనకోన మండలం బలుసుదిబ్బ, మాసాలదిబ్బ గ్రామాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి హరీష్ బాలయోగి ప్రచారంలో మాట్లాడారు. ప్రచారంలో తెలుగుదేశం నాయకులు దాట్ల పృథ్వీ వర్మ, నాగిడి నాగేశ్వరరావు, చెల్లి అశోక్, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డు కిరువైపుల ఆక్రమణలు తొలగించాలి

విశాలాంధ్ర - తాళ్ళపూడి : మండల కేంద్రమైన తాళ్లపూడిలో ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెట్టినట్లు తాళ్లపూడి ఎస్సై శ్యాంసుందర్ తెలిపారు. మార్కెట్లో రోడ్డు ఇరువైపులా ఉన్న షాపు యజమానులు ఆక్రమణలు తొలగించాలని, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించవద్దని ఆయన పేర్కొన్నారు మెయిన్ రోడ్‌లో ఇరుకైన మార్గం ఉండటం వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇప్పటికే భారీ వాహనాలు మెయిన్ రోడ్ల రాకుండా దారి మళ్లించేలా చర్యలు తీసుకున్నామని ఎస్ఐ పేర్కొన్నారు ట్రాఫిక్ విషయంలో ఎక్కువసార్లు తమ సిబ్బంది పర్యవేక్షణ లో ఉందని ఆయన పేర్కొన్నారు ఈ నేపథ్యంలోనే ఎస్సై తన సిబ్బందితో మార్కెట్లో పర్యటించి జాగ్రత్తలు చెప్పారు.

ఎన్నికల అధికారుల ఆదేశాలు భేఖాతరు

ఓటర్ల వెరిఫికేషన్‌లో వాలంటీర్లను వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రావులపాలెం : ఎన్నికల అధికారుల ఆదేశాలను సైతం భేఖాతరు చేసి ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియలో గ్రామ వాలంటీర్లను స్థానిక ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వినియోగించుకుంటున్నారని రావులపాలెం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. రావులపాలెం పార్టీ కార్యాలయం వద్ద మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలను లెక్కచేయకుండా వలంటీర్లతో ఓటర్ల జాబితా వడపోతకు తెరలేపారని అన్నారు. ఏ ఓటరు ఏ పార్టీకి అనుకూలంగా ఉన్నారు. బయటి ఊరిలో ఉన్న ఓటర్లు వంటి వివరాల సేకరణ వంటి కార్యక్రమాలు రావులపాలెం సీఆర్సీ అడ్డాగా వాలంటీర్లతో స్థానిక ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పని చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో చిలువూరి సతిష్ రాజు, గుత్తుల పట్టాభిరామరావు, సిద్దిరెడ్డి శ్రీనివాస్, సయ్యపురాజు నరసింహారాజు, జక్కంపూడి బాలాజీ, కోట వేంకటేశ్వరావు, వడ్లమూడి రామారావు, కోట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికేలో ధాన్యం అమ్మినా చార్జీలు ఇవ్వలేదు

మహిళా రైతు ఫిర్యాదును పట్టించుకోని వైనం

విశాలాంధ్ర - కాట్రేనికోన : పల్లంకురు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం విక్రయించినా ట్రాక్టర్ అద్దె పేరుతో తన వద్ద రూ.5000లు తీసుకుని మోసం చేశారని గ్రామ శివారు చింతలచెరువుకు చెందిన మహిళా రైతు రొక్కం సుజాత ఆరోపిస్తోంది. ఈ మేరకు తాను గత ఏడాది ఆగస్టు నెలలోనూ, ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో జిల్లాకలెక్టర్ స్పందనలో ఫిర్యాదులు చేసినా మండల వ్యవసాయ అధికారులు పట్టించుకోలేదని ఆమె వాపోతోంది. 2023 రబీ సీజన్ ఏప్రిల్‌లో 89.2 క్వింటాళ్ల ధాన్యమును అగ్రికల్చర్ అసిస్టెంట్ కె సత్య ప్రకాష్ తూకం తూసుకుని మీ ధాన్యం గవర్నమెంట్ కొనదు. వేరొక రైతు పేరున అమ్ముడు అవుతుందని చెప్పి మిల్లర్ ట్రాక్టర్లో లోడ్ చేయించి ఐదు రోజుల వరకు వెళ్లలేదని, నా వద్ద రోజుకు ట్రాక్టర్ అద్దె రూ.1000లు చొప్పున రూ.5000/-వసూలు చేసినట్లు అని తెలిపింది. ఎఫ్టీవో నెంబర్ 9045200062300025. సొమ్ము చెల్లించకుంటే ధాన్యమును పొలంలో వదిలేస్తామని కూడా బెదిరించినట్లు ఆమె తెలిపింది. ట్రాన్స్పోర్ట్ చార్జీలు, హమాలీ చార్జీలతో సహా మీ అకౌంట్లో వస్తాయని సత్య ప్రకాష్ నమ్మించినా ఈరోజుకి సొమ్ము రాలేదని ఆమె ఫిర్యాదులో ఆరోపించింది. జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆ మహిళా రైతు సుజాత ఆవేదన వ్యక్తం చేస్తోంది. రైతు భరోసా కేంద్రం దళారీ కేంద్రంగా మారిందని నా సొమ్ము చెల్లించకుంటే అగ్రికల్చరల్ అసిస్టెంట్ సత్య ప్రకాష్, మిల్లర్ వరదా నాగరాజుల పై న్యాయపోరాటం చేస్తానని కూడా ఆమె హెచ్చరించింది.

గ్రామాల్లో పోలీసు కవాతు

విశాలాంధ్ర - మామిడికుదురు : పి గన్నవరం సర్కిల్ సీఐ డి ప్రశాంత్ కుమార్, ఆధ్వర్యంలో నగరం పోలీసు స్టేషన్ ఎస్ఐ పివిఎస్ఎస్ఎన్ సురేష్ పర్యవేక్షణలో శుక్రవారం మామిడికుదురు మండలంలోని పలు గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మామిడికుదురు, పాశర్లపూడి, అప్పనపల్లి గ్రామాల్లోని మెయిన్ రోడ్డులలో సెంట్రల్ ఇండిస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్), స్థానిక పోలీసులుతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో సజావుగా జరగాలని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిర్వహణకు ఆటంకం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గెలుపే ధ్యేయంగా పని చేయాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : మండల కేంద్రమైన జగ్గంపేట వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట నరసింహం, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ గెలుపునకు ప్రతి ఒక్కరూ సైనికులుగా పని చేయాలని కాకినాడ జిల్లా జెసియస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్ అన్నారు. శుక్రవారం జగ్గంపేట మండల పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు.. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చెరుకూరి జయరాజ్, గొల్లపల్లి శ్రీను, ఆకుల శ్రీధర్, కిలపర్తి వీరబాబు, కాపవరపు ప్రసాద్, సచివాలయ కన్వీనర్ రెడ్డి భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నీలాద్రిరావు పేట వద్ద వ్యాన్ బోల్తా

అక్రమంగా పీడీఎస్ రైస్ తరలింపు

విశాలాంధ్ర - గండేపల్లి : రోడ్డు ప్రమాదంలో పీడీఎస్ రైస్ బయటపడింది. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల బియ్యం దొడ్డి దారిన నేరగాళ్లు తరలిస్తున్న వైనం బయట పడింది. గండేపల్లి మండలం నీలాద్రి రావుపేట గ్రామ శివారు వీరమ్మ పేరంటాల అమ్మవారి గుడి వద్ద పిడిఎస్ రైస్‌తో వెళ్తున్న వ్యాను ప్రమాదానికి గురి అయింది. విజయవాడ నుండి పిఠాపురం మండలం బి ప్రత్తిపాడు వెళుతున్న ఐసర్ వ్యాన్ 252 బస్తాలులో 90 క్వింటాలు సుమారుగా మూడు టన్నులు పిడిఎస్ రైస్ అక్రమంగా తరలిస్తున్న వ్యాను జాతీయ రహదారి పై వెళుతుండగా అదుపుతప్పి డివైడర్ ఢీ కొట్టి రోడ్డుకి అవతల వైపు వెళ్తున్న హైవే కూలీలు టాటా ఏసీ వ్యానును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హైవే కూలీలకు నలుగురు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వైద్యు నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా కాకినాడ నుండి వచ్చిన డీఎస్ఓ ఎంవి ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ నుండి అక్రమంగా పిడిఎస్ రైస్‌ను వెలుగు వాసు అనే వ్యక్తి ఇటువంటి ఉత్తర్వులు లేకుండా విజయవాడలో సర్వో ఆగ్రో కంపెనీ నుండి తరలిస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి ఈ రైస్ బయటపడిందని దీని విలువ 4,50,000 ఉంటుందని తెలిపారు. ఈ పీడీఎస్ రైసును మధ్య భక్తుల సమక్షంలో స్వాధీనం చేసుకుని ఎమ్మెల్యేస్ పాయింట్కు తీసుకువెళ్లడం జరిగిందని తరలిస్తున్న వ్యక్తిపై క్రిమినల్ కేసుకు పోలీసులకు అప్పజెప్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు ఎమ్మెస్ ఓ కృష్ణ పాల్గొన్నారు.

బొరుసు బ్రహ్మానందం ఆశయాలు కొనసాగిస్తాం

విశాలాంధ్ర - రాజోలు : సీపీఐ నాయకులు రామరాజులంక గ్రామ మాజీ సర్పంచ్ బొరుసు బ్రహ్మానందం 36వ వర్ధంతి శుక్రవారం మలికిపురం మండలం రామరాజులంక పంచాయతీ వద్ద ఘనంగా నిర్వహించారు. తొలుత సీపీఐ నాయకులు బ్రహ్మానందం, కనుమూరు రంగరాజు విగ్రహాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేశనీడి ఉదయ భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సభలో అంబేద్కర్ కోనసీమ జిల్లా సిపిఐ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బ్రహ్మానందం మరణం గ్రామానికే కాక కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని, ఆయన రాజకీయాలకతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాకర శ్రీనివాస్, మేడిచర్ల రాము, వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నల్లి శివకుమార్, మాజీ సొసైటీ అధ్యక్షులు బొరుసు ఉమారావ్, మేడిచర్ల సూర్యప్రకాశరావు, మాజీ ఎంపీటీసీ ముత్యాల నానాజీ, సిసిఎఫ్ సొసైటీ అధ్యక్షులు నల్లి బాలకృష్ణ, ముత్యాల దొర, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి మేడిచర్ల సత్యనారాయణ, ఏపుగంటి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీభాయ్‌ని ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : కాకినాడ నెహ్రూ యువ కేంద్రం పెద్దాపురం బ్లాక్ అధ్వర్యంలో శుక్రవారం మహిళ దినోత్సవం నిర్వహించారు. జగ్గంపేట అక్షర జూనియర్, డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీడీవో వసంత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 18 ఏళ్ళు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటును నమోదు చేయించుకుని వినియోగించుకోవాలన్నారు. మణికర్ణిక యువజన సంఘం అధ్యక్షురాలు జి. అనూష మాట్లాడుతూ మహిళ ప్రాధాన్యత వివరించారు. ప్రతి మహిళ కూడా ఝాన్సీలక్ష్మి భాయ్‌ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఆళ్ళ రవి కిషోర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్‌వైకె వాలంటీర్స్ అప్పన్న, పుష్ప, ప్రవల్లిక, పెన్నడ దేవి పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర -పెరవలి :నియోజకవర్గంలో పూరి గుడిసే లేకుండా అర్హులకు ఇళ్లు, పేదలకు ఇళ్లస్థలాలు అందించడమే లక్ష్యంగా పరిపాలన అందిస్తున్నామని నిడదవోలు శాసనసభ్యులు జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. శుక్రవారం పెరవలి దీపికా ఫంక్షన్ హాల్‌లో పెరవలి మండలంలో గల అర్హులైన సుమారు 2వేల మంది లబ్దిదారులకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ భూహక్కు పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సంతోషంగా ఉండేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ సర్పంచ్‌లు, ఎంపీపీ కార్చెర్ల సీతారాం ప్రసాద్,తహసీల్దార్ సుధ యం పి డి ఓ హిమ మహేశ్వరి, మండల సమైక్య అధ్యక్షురాలు స్వరూపారాణి, వైస్ ఎంపీపీ వెంద్ర శ్రీనివాస్,జడ్పీటీసీ కొమ్మిశెట్టి రామాంజని కిచ్చు, రాష్ట్ర డైరెక్టర్ దొడ్డిగర్ల స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలు

విశాలాంధ్ర - గోపాలపురం : త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఈవీఎం లు, వివి ప్యాడ్స్ వచ్చినట్లు వాటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచినట్లు తహసీసిల్దార్. డి. వనజాక్షి తెలిపారు.

రానున్న ఎన్నికల నిర్వహణ నిమిత్తం 18 ఈవీఎంలు, వివి ప్యాడ్స్ వచ్చినట్లు వాటిని దేవరపల్లి సీఐ బాల సురేష్ బాబు, పొలిటికల్ పార్టీలు, ఆధ్వర్యంలో అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచినట్లు తెలిపారు. వారి వెంట ఎస్సై సతీష్ కుమార్, డిటి సాకే కృష్ణ, పలు పార్టీ నాయకులు సమక్షంలో భద్రపరిచారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

అధికార, విపక్ష పార్టీల మధ్య ఫ్లెక్సీల వివాదం

విశాలాంధ్ర - సీతానగరం: అధికార, విపక్ష పార్టీల మధ్య ఫ్లెక్సీలు వివాదం నెలకొంది. మండలంలో వంగలపూడి ర్యాంపు నుండి శివరాత్రి పురస్కరించుకొని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం పట్టిసీమ శ్రీ వీరభద్రస్వామి దర్శనానికి భక్తులు తరలి వెళ్ళడానికి వీలుగా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ ర్యాంపులో వైసీపీ, జనసేన, టీడీపీ పార్టీలు తమ తమ నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. శుక్రవారం కొంత సమయం గడిచిన తరువాత టీడీపీ, జనసేన పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని అధికారులు రెండింటినీ తొలగించగా ఈ విషయం తెలుసుకున్న టీడీపీ, జనసేన నాయకులు ఫ్లెక్సీలను తొలగిస్తే మర్యాదగా ఉండదు అని ఇరు పార్టీల నాయకులు పదుల సంఖ్యలో వాగ్వివాదంకు దిగగా అక్కడే ఉన్న ఎస్ఐ టీ. రామకృష్ణ ఇరు పార్టీల నాయకులకు సర్ది చెప్పి అక్కడ నుండి పంపేశారు. ఎన్నికలు దగ్గర పడడంతో ఈ ఫ్లెక్సీల గొడవ జరగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తగిన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటే ఇటు వంటి గొడవలకు అవకాశం ఉండదని ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

పులిహోర, మంచినీళ్ల పాకెట్ల పంపిణీ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : స్థానిక సీతంపేట దగ్గర గల వాటర్ ట్యాంక్ లు ఎదురుగా టీ.కే. విశ్వేశ్వర్ రెడ్డిచే నిర్మించబడిన తేతలి కనికిరెడ్డి బస్టాండు వద్ద శివరాత్రి మహా పర్వదిన సందర్భంగా పులిహోర ప్యాకెట్స్ ,మంచినీళ్ళ ప్యాకెట్స్ గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షులు టీ.కే. విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ శివరాత్రి మహా పర్వదిన సందర్భంగా రాజమండ్రి చుట్టుపక్కల ప్రాంతాల నుండి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలను ఆచరించి వివిధ దేవాలయాలను భక్తులు సందర్శించి పూజలు చేసుకుని వారి స్వస్థలాలకు వెళ్తుంటారు. ఈ కార్యక్రమంలో గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు ఎస్.వి.వి. రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, నాలం వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, సురేష్, వెంకట్, శ్రీను పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : తాళ్లపూడి మండలం అన్నదేవరపేట తొండెపు బుల్లి రాజు వాటర్ ప్లాంట్ వద్ద గ్రామ తెలుగుదేశం యువ గళం నాయకుల సహకారంతో లకం సాని రామానుజన్మ జ్ఞాపకార్థం తాళ్లపూడిలోని రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని హాజరైన ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆపరేషన్ అవసరమైన గుర్తించి వారికి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. యువగళం నాయకులు కూచిపూడి గణపతి, తొండపు భరత్ తదితరులు పాల్గొనగా వైద్య శిబిరం నేత్ర వైద్యశాల కు చెందిన డాక్టర్ సిహెచ్ నాగరాజు, శ్రావణి, కోఆర్డినేటర్ సూరిబాబు పాల్గొని వైద్య సేవలు అందించారు.

వాటర్ ట్యాంక్‌తో నీటి సరఫరా

విశాలాంధ్ర- తాళ్ళపూడి : తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం పంచాయతీ పరిధిలో గత రెండు రోజులుగా ప్రజలకు వాటర్ ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేసే కార్యక్రమాన్ని కొన సాగిస్తున్నారు. వేగేశ్వరపురం పంచాయతీకి సంబంధించిన మోటార్ కేబుల్ వైర్లు దొంగలు అపహరించారు. దీనికి తోడు బోరు పాడైపోయినందున ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని సర్పంచ్ యుద్ధ ప్రాతిపదికన వాటర్ ట్యాంక్ ద్వారా నీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు. గోదావరి నీటిని తాగునీటిగా అందించే పథకం కూడా గత నాలుగు రోజులుగా పనిచేయక పోవడంతో ఈ ఇబ్బందిని కూడా అధిగమించేలా వాటర్ ట్యాంకుతో ఇంటింటికి నీటి సరఫరా చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి డి.ఎస్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కొత్తగా మోటార్ కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం సక్రమంగా సాగేందుకు సచివాలయ కార్యదర్శి నాగాంజనేయులు, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

ఓలా ఎలక్ట్రిక్ ఎస్1పై మార్చి31 వరకు రూ.25 వేలు తగ్గింపు

విశాలాంధ్ర/రాజమండ్రి: ఓలా ఎలక్ట్రిక్ తన ఎస్1 స్కూటర్ పోర్ట్‌ఫోలియోపై మార్చినెలలో రూ.25,000 వరకు ధర తగ్గింపును ప్రకటించింది. ఈ ప్రకటన భారతదేశం వాహనరంగ విద్యుదీకరణ ప్రయత్నాలను వేగవంతం చేయడానికి, ఈవి స్వీకరణకు ఉన్న అన్ని అడ్డంకులను అధిగమించడానికి కంపెనీ అతిపెద్ద కర్తవ్యాన్ని కొనసాగించడం లక్ష్యంగా పెట్టుకుంది. అద్భుతమైన వెర్టికల్లీ ఇంటిగ్రేటెడ్ అంతర్గత సాంకేతికత, తయారీ సామర్థ్యాలు, ఉత్పాదక ప్రోత్సాహకాలకు అర్హతతోపాటు కంపెనీ బలమైన వ్యయ నిర్మాణం కారణంగా ఓలా తమ వాహనాలను అత్యంత సరసమైన ధరలో అదించగలుగుతుంది.ఫేమ్ 2 (ఫాస్టర్ అడాప్షన్ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్ తయారీ) పథకం 2024 మార్చి 31న ముగిసే అవకాశం ఉన్నందున, ఈవిల ధరల్లో మార్పులు ఉండవచ్చు. కావున, ఓలా ఎస్1ని కొనుగోలు చేయడానికి ఇదే ఉత్తమ సమయం. ఇది సంవత్సరానికి రూ 30,000 వరకు పొదుపుకు అవకాశాన్ని ఇస్తుంది.

జిల్లా వైకాపా కార్యదర్శిగా అక్షయపాత్ర

విశాలాంధ్ర-కొవ్వూరు :

జిల్లా వైకాపా కార్యదర్శిగా కొవ్వూరు పట్నానికి చెందిన అక్షయపాత్ర ఫౌండేషన్ చైర్మన్ 15 వ వార్డు కౌన్సిలర్ రామా సొసైటీ అధ్యక్షులు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధిష్టానం మేరకు ఈయనకు సమాచారం అందింది పార్టీ ఆవిర్భావం నుంచి పట్టణంలోని జిల్లాలోని అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలందరి దృష్టిలో చోటు చేసుకున్నారు ముఖ్యంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 15 వార్డుకు మంచి నీటి ఇబ్బంది ఏర్పడితే సొంతంగా వాటర్ ట్యాంక్ ను ఏర్పాటు చేసి అక్కడ ప్రజలకు దాహార్తినితీర్చారు. అదేవిధంగా కరోనా సమయంలో ప్రజలకు బియ్యం కూరగాయలు కిరాణా వస్తువులను అందజేసి ప్రజలను ఆదుకున్నారు అదేవిధంగా హెూంమంత్రి తానేటి వనిత పుట్టినరోజు సందర్భంగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్య సేవలను అందించారు. ఈ నేపద్యం అక్షయపాత్రకు జిల్లాస్థాయి పదవి రావడంతో గోపాలపురం ఎమ్మెల్యే కొవ్వూరు ఇంచార్జ్ తలారి వెంకట్రావు, రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, ఉభయగోదావరి జిల్లాల కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి తదితర వైకాపా అధినాయకులు అభినందించారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావనతో మెలగాలి

విశాలాంధ్ర - నిడమర్రు: ప్రతి ఒక్కరు భక్తి భావనతో మెలగాలని, భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించాలని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం మహా శివ రాత్రి పర్వదినం సందర్భంగా నిడమర్రు మండలం పెద నింద్రకోలను గ్రామంలో స్వయంభు పార్వతీ సమేత భీమేశ్వర స్వామి శివాలయంలో ఆ పరమేశ్వరుణ్ణి దర్శించుకొని , స్వామి వారి తీర్థ ప్రసాదలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వంగ రఘు, మైలవరపు సురేంద్ర కుమార్,కోటి శ్రీను, గంధం పుల్లయ్య, పచ్చకుల రమేష్, అడప రాంబాబు, లంక రాంబాబు, గ్రామ పెద్దలు,నియోజకవర్గం జనసేన నాయకులు, గ్రామ జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

విట్‌లో నేషనల్ లెవెల్ కాంక్రీట్ కేనో కార్నివాల్ ఛాలెంజ్

విశాలాంధ్ర -భీమవరం: నేషనల్ లెవెల్ కాంక్రీట్ కేనో కార్నివాల్ ఛాలెంజ్ -24 పోటీ విద్యార్థులకు ఎన్నో సవాళ్లు నేర్పుతుందని శ్రీవిష్ణు ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ కె.వి.విష్ణురాజు అన్నారు. సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ అధ్వర్యంలో "నేషనల్ లెవెల్ కాంక్రీట్ కేనో కార్నివాల్ ఛాలెంజ్ - 2కె 24" గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంక్రీట్ తో తేలికైన పడవను తయారుచేయుట మరింత హైడ్రోడైనమిక్ సాఫ్ట్‌వేర్ బోట్‌ను రూపొందించడానికి, ఎలా ఉపయోగించాలో విద్యార్థులు నేర్చుకోవడం ఈ పోటీ యొక్క ప్రధాన ఉదేశ్యం అన్నారు. బ్రాంచ్‌ల మధ్య సరిహద్దులు తుడిచిపెట్టుకుపోతున్నందున ప్రతి బ్రాంచ్ విద్యార్థి ఇతర బ్రాంచ్‌లోని కొన్ని ప్రాథమిక భావనలపై పరిజ్ఞానం కలిగి ఉండాలి అని ఆయన సూచించారు. ఈ రోజుల్లో సివిల్ ఇంజనీరింగ్ అంటే సివిల్ ఇంజనీరింగ్ మాత్రమే కాదని, మెకానికల్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కోడింగ్ మొదలైనవి కూడా మిళితమై ఉన్నియని ఆయన గుర్తు చేశారు అన్నారు. తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ బి.జానకి రామయ్య, విట్ ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు, డైరెక్టర్ డాక్టర్ దశిక సూర్యనారాయణ మాట్లాడుతూ తరగతిలో నేర్చుకున్న సిద్ధాంతాలను, ఆలోచనలను వర్తింపజేయడానికి అవకాశాన్ని అవకాశము కార్నివాల్ లో లభిస్తుందన్నారు. ఇంజనీరింగ్ నైపుణ్యం, హైడ్రో డైనమిక్ డిజైన్ మరియు రేసింగ్ టెక్నిక్‌లను మిళితం చేసే ఈ అనుబంధ పోటీ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు బాగా సహాయపడుతుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ కె.సాయి సుమంత్, ప్రోగ్రాం కన్వీనర్ వి.వి.వై.శర్మ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, సిబ్బంది, పాల్గొన్నారు.

మహిళల కోసం కలలకు రెక్కలు సరికొత్త పథకం

విశాలాంధ్ర-నరసాపురం: మహిళా సాధికారత దిశగా టిడిపి జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కలలకు రెక్కలు కార్యక్రమం చేపట్టనున్నట్లు టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి తెలిపారు.శుక్రవారం ఆమె నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత దిశగా తెదేపా అధినేత చంద్రబాబు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కీలక ముందడుగు వేశారన్నారు. కలలకు రెక్కలు అనే పేరుతో ఓ సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకొచ్చారని తెలిపారు. ఇంటర్ పూర్తయిన నిరుద్యోగ మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసి వారి కాళ్ళపై వారు నిలబడే విధంగా ఉపాధి కల్పించే విధంగా సహకారం అందిస్తారాన్నారు. ఈ పథకం కింద కోర్సుల కోసం మహిళలు తీసుకునే మొత్తం రుణానికి సంబంధించి వడ్డీని కూడా టిడిపి జనసేన ఉమ్మడి ప్రభుత్వం చెల్లిస్తుందని ఆమె తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శివరాత్రి

విశాలాంధ్ర - లింగపాలెం : శివరాత్రి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో జరిపారు. ధర్మాజీగూడెం, ఆశన్నగూడెంలలో ప్రసిద్ధిగాంచిన శివాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనేక మంది భక్తులు జాగారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బలివే పుణ్యక్షేత్రానికి తరలివెళ్ళారు. బలివే పుణ్యక్షేత్రానికి వెళ్ళే భక్తుల కోసం అనేకమంది స్వచ్ఛందంగా దారి పొడవునా భోజనాలు, పులిహోరాశాలలను, మజ్జిగ, మంచినీటి కేంద్రాలను ఏర్పాటు చేసి తమ శివభక్తిని చాటుకున్నారు.

ప్రతి భక్తుడు భక్తిశ్రద్ధలతో పూజించాలి

విశాలాంధ్ర - నిడమర్రు: ప్రతి భక్తుడు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి పుణ్యఫలాలను పొందాలని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా నిడమర్రు మండలం, మందలపర్రు గ్రామంలో ఉన్న ఉమా నీలకంఠేశ్వర స్వామి శివాలయం వద్ద స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం కమిటీ, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి పూజలు అనంతరం ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంకు సత్య కుమార్, సంకు నాగ శేషు, సంకు కొండలరావు నాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర-పోడూరు: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని జిన్నూరు లో అన్నపూర్ణేశ్వరి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుండి జిన్నూరు పరిసర గ్రామాల ప్రజలు ఆలయం వద్దకు తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద జరిగిన భారీ అన్న సమారాధనలో జిన్నూరు, జిన్నూరు పాలెం, ఉల్లంపర్రు, వేడంగి, వేడంగి పాలెం, మట్టపర్రు , కవిటం, తదితర గ్రామాలనుండి సుమారు భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ జమ్ము మృత్యుంజయరావు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అన్న సమారాదనను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో పూల దండలతో అందంగా అలంకరించారు. గ్రామ సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, పాలకొల్లు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి, ఏఎమ్ సి వైస్ చైర్మన్ టీటీడీసీ బాబు, తదితరులు స్వామి వారిని దర్శించుకుని పూజలు జరిపారు. మండలం లోని వేడంగి,మట్టపర్రు కవిటం పోడూరు పెనుమదం, గుమ్ములూరు రావిపాడు తదితర గ్రామాలలో శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆ యా ఆలయాల వద్ద భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు పూజలు జరిపారు.

తేదేపాతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-మండవల్లి: తేదేపా తోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ కన్వీనర్ కొడాలి వినోద్ పేర్కొన్నారు. శుక్రవారం కానుకొల్లు గ్రామం నుండి ధర్మ పోరాట పాదయాత్ర ప్రారంభించి స్వయంగా పాల్గొన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేసి మహిళలకి సన్మానం చేసి , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి పాదయాత్ర ప్రారంభించారు.ఈ సందర్భంగా కొడాలి వినోద్ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల్లోకి ధర్మ పోరాట పాదయాత్ర ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరమల్లు నరసింహారావు, పెనుమత్స త్రినాధ్ రాజ్, బి కే యం నాని, భలే ఏసు రాజు, గజ్జల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు

విశాలాంధ్ర-తణుకు: విద్య ద్వారా సమాజంలో సమూల మార్పులు వస్తాయని రాష్ట్ర వీవర్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర బీసీ నాయకురాలు,లయన్ పి ఎం జె ఎఫ్ వావిలాల సరళాదేవి అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ వద్ద గల ఎస్ వి ఎస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడుతూ మహిళలు అని రంగాల్లో దూసుకు పోతున్నారని పురుషుల కంటే స్త్రీలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తున్నారని కొనియాడారు. సమాజంలో అతివలతోనే అభివృద్ధి సాధించవచ్చన్నారు. మహిళలకు ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్న సమయంలో అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని వావిలాల సరళాదేవి స్పష్టం చేశారు. సమాజంలో నేటి మహిళల పాత్ర గురించి విద్యార్థులకు సందేశానిచ్చారు. అనంతరం స్కూల్ యాజమాన్యం, కళాంజలి సంస్థ నుండి ఎన్ రమణి, నక్క రామారావు తదితరులు సరళాదేవి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ డి కేశవరావు, డైరెక్టర్ కలగ రాంకుమార్, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర -భీమవరం: స్వేచ్ఛ మహిళా సంఘం ఆధ్వర్యంలో హెచ్ఐవి బాధిత కుటుంబాలకు పౌష్టికాహార కిట్లు అందించే కార్యక్రమం భీమవరం లోని సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని దాతల సహాయ సహకారాలతో సమాజంలో పేదరికం, వెనుకబాటు తనంగా ఉన్న వారికి అండగా ఉంటూ వారికి చేయూతనిస్తున్న స్వేచ్ఛ మహిళా సంఘం సభ్యులను అభినందించారు. సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ దుంగా వెంకటరమణ జ్ఞాపకార్థంగా వారి కుమారుడు దుంగా వకుల్ సౌజన్యంతో 20 మంది హెచ్ఐవి బాధిత కుటుంబాల వారికి పౌష్టికాహారం బియ్యం, పప్పు దినుసులు, బెల్లం, పంచదార, పండ్లు కిట్లుగా అందించారని అన్నారు. కార్యక్రమంలో స్వేచ్ఛ మహిళా సంఘం అధ్యక్షురాలు ఎం.ధర్మావతి, సభ్యులు వై.గౌరీ, డి.పద్మ, వై.లక్ష్మి, ఏ.రమణమ్మ, సి హెచ్ స్వాతి, కె.విజయలక్ష్మి, పి.నాగమణి, కృప, కె.సింహాచలం, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పిఎస్ఎం ఉపాధ్యాయినులకు సత్కారం

విశాలాంధ్ర -భీమవరం: శ్రీ ఉమా సోమేశ్వర వాకర్స్ అసోసియేషన్, శ్రీ ఉమా సోమేశ్వర మహిళా వాకర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పిఎస్ఎం బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయినులను సత్కరించారు.రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నక్కా హన్నా యూనిసీ జ్ఞాపకార్థం వారి భర్త శీలం మార్టిన్ బాబు సౌజన్యంతో జె.సుధారాణి, మహాలక్ష్మి, కె.శ్రావణి, కె.అన్నామణి, ఎ.గౌరీ సత్య సుధ, మెర్సీ ఎలిజబెత్ తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో మెంటే పూర్ణచంద్రరావు, గారు, మాదాసు కనకదుర్గ, శీలం మార్టిన్ బాబు, జవ్వాది దాశరధీ శ్రీనివాస్, మోపిదేవి సత్యనారాయణ, పురుషోత్తపు అర్జునరావు, తోట రాంబాబు, సత్తినీడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మహిళా కార్మికులకు సత్కారం

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య మహిళా కార్మికుల సేవలు కీలకమైనవని , లయన్స్ క్లబ్ స్పిరిట్ అధ్యక్షురాలు నూకల జయ భారతి అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ప్రజారోగ్య విభాగంలో ఉత్తమసేవలు అందిస్తున్న ఆరుగురు పారిశుద్ధ్య మహిళా కార్మికులను సత్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన లయన్స్ క్లబ్ స్పిరిట్ అధ్యక్షురాలు నూకల జయభారతి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెల కట్టలేనివని అన్నారు.సమాజంలో మహిళలు నిర్వహిస్తున్న పాత్రను గుర్తించి గౌరవించడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు.మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి. గోపాలం మాట్లాడుతూ పారిశుద్ధ్య పరిరక్షణలో మహిళా కార్మికుల కృషి ప్రశంసనీయమైనదని, వారిని లయన్స్ క్లబ్ తరపున సత్కరించడం సంతోషకరమని అన్నారు.పారిశుద్ధ్య మహిళా కార్మికులు ధనాల లక్ష్మి , పెనుమాక కోటమ్మ , బంగారు ముసలమ్మ , బాదంపూడి మరియమ్మ, కుమ్మిరాల నాగలక్ష్మి , గండేటి రామలక్ష్మి,ని లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు బత్తుల ప్రసాద్, ఎన్.నాగ మల్లేశ్వరరావు , ఏ.రంజిత్, కే.మణికంఠ, శానిటరీ ఇనస్పెక్టర్ శ్రీమన్నారాయణ, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం. కాటమరాజు, ఉప్పాటి నాగరాజు, అల్లం నరేంద్ర , దానయ్య తదితరులు పాల్గొన్నారు.

30 మంది మహిళలకు సన్మానం

విశాలాంధ్ర - ఉంగుటూరు: అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ ఇంచార్జ్ పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మరాజు 30 పేద కుటుంబాలకు చెందిన మహిళలకు చీరలు,పండ్లు పంపిణి చేశారు.అనంతరం ధర్మరాజు నియోజకవర్గం వీర మహిళలతో కలిసి కేక్ కటింగ్ చేసి వారిని శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ స్త్రీ లేనిదే సృష్టి లేదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం జనసేన నాయకులు, వీర మహిళలు చిట్టూరి పార్వతి ,నిమ్మల మౌనిక, అంబటి మాధవి, లీల, మద్దాల విజయలక్ష్మి, భీమన దుర్గ పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి వినూత్న పథకాలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మహిళా సాధికార దిశగా తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబు జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ మహిళల కోసం ప్రత్యేకంగా మరో కీలక ముందడుగు వేశారని తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె నివాసం వద్ద మహిళలతో కలిసి ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ" కలలకు రెక్కలు" అనే సరికొత్త పేరుతో ఓ పథకాన్ని మహిళల కోసం ప్రత్యేకంగా తీసుకురావడం జరిగిందని, ఆంధ్ర రాష్ట్రంలో ఆడబిడ్డ చదువుకోవడానికి ఆర్థిక స్తోమత లేక ఇంటికే పరిమితం అవుతున్నారని విషయాన్ని గమనించి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దృఢమైన సంకల్పంతో ఈ పథకాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ పథకం కింద మహిళలు తీసుకునే మొత్తం రుణానికి సంబంధించిన వడ్డీని కూడా టిడిపి జనసేన ఉమ్మడి ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. మహిళల కలలకు లెక్కలు అనే వెబ్సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకొని సర్టిఫికెట్ పొందుపచ్చని ఆమె తెలిపారు. రిజిస్టర్ పొందడానికి9261292612 మిస్సిడ్ కాల్ ఇవ్వాలని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు దొడ్డపనేని దుర్గాదేవి, కొత్త రమ, మంగతాయరు, లక్ష్మి, నల్లపర్తి ఝాన్సీ పాల్గొన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో అన్యాయం

విశాలాంధ్ర - వేలేరుపాడు : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఆదివాసి యువ చైతన్య మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాలలో అన్యాయం జరుగు తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక చట్టాలు తెచ్చినప్పటికీ అవి పటిష్టంగా అమలు చేయకపోవడం వలన మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయి అన్నారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని, పని వేళలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మడకం సునీత, సవలం కనక, కాక రజిని, కారం శారద, మడకం చంద్రమ్మ, మిరియాల కళావతి తదితర మహిళ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మండల వైద్యాధికారిణి జె.కల్పనా రాణి తెలిపారు. స్థానిక విజన్ యుపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, అమ్మకు వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల పట్ల వివక్షత రూపుమాపాలని అన్నారు.ఆడ పిల్లలకు అవకాశాలు కల్పిస్తే పురుషులతో సమానంగా రాణించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, వరలక్ష్మి, అరుణ, మహాలక్ష్మి, పుష్పవతి, ఏస్తరు రాణి, మధులత,రమ్య శ్రీ, మౌనిక, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జన్మనిచ్చిన తల్లి నీకు వందనం

విశాలాంధ్ర - లింగపాలెం : జన్మనిచ్చిన ఓ తల్లి నీకు వందనమమ్మా... నీవు పడే కష్టానికి, నీవు చూపే త్యాగాలకు వెలకట్టలేమమ్మా... సృష్టికి శక్తివంతమైన నీ గొప్పతనాన్ని ఎలా మరువగలవమమ్మా... అని లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని లింగపాలెం మండలంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో లిడ్ క్యాప్ డైరెక్టర్ పాల్గొని ప్రసంగించారు. డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో లింగపాలెం వెలుగు కార్యాలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలను చైతన్యం చేసేందుకు అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం కమల, జ్యోతి తదితరులు పాల్గొని ప్రసంగించారు. మహిళలు అభివృద్ధి చెందాలని దీనివల్ల సమాజం ఆదర్శవంతంగా ఉంటుందని అన్నారు. పలు రంగాలలో అభివృద్ధి చెందిన మహిళల గొప్పతనాన్ని ఈ సందర్భంగా వివరించారు.

సమాజంలో మహిళలది కీలక పాత్ర

విశాలాంధ్ర -నూజివీడు : భారతీయ సమాజంలో మహిళల ది ఎప్పుడు ప్రధాన పాత్ర అని మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు.నూజివీడు లోని ఆయన కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు మహిళలకు నూతన వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా సామాజికంగా బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులుగా వివిధ శాఖలలో ఉద్యోగులుగా చివరికి సైనిక దళాలలో మేముసైతం అనేలా మహిళలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నారన్నారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం నూజివీడు నియోజకవర్గం లోని ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని తనతో నడిచిన నాయకులు కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా నిలుస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శీలం పద్మా , జొన్నలగడ్డ శివలక్ష్మి , భూక్య నాగమణి , బుర్ల నాగ పద్మ , అన్నే విజయలక్ష్మి మరియు మహిళలు పాల్గొనడం జరిగింది.

పీహెచ్‌సిలో మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గణపవరం పీహెచ్‌సి మహిళా డాక్టర్ పి.కిరణ్మయికి, మహిళ ఉద్యోగులు ఏఎన్ఎంలు, పి ఎన్ ఎం ఎస్ లు, ఎం ఎల్ హెచ్ పి ఎస్, నర్సులు, స్టాఫ్ నర్సు, ఇతర మహిళా ఉద్యోగులకు 30 మందికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గణపవరం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, జే విల్సన్ బాబు, హెల్త్ అసిస్టెంట్లు ఎమ్ ఎస్ యోహాన్,జి శ్రీనివాస్, ఎ. కృష్ణ, రవికుమార్, ఎం.నల్లయ, మహిళలను ఘనంగా సత్కరించారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

విశాలాంధ్ర-కలిదిండి: అత్యంత శక్తి వంతులుగా నేడు అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తు న్నారని కోరుకొల్లు గ్రామపంచాయతీ 4వ వార్డు మెంబర్ చన్నంశెట్టి. తులసీ నాగలక్ష్మీ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడ స్త్రీ గౌరవించబడి పూజింప బడుతుందో అక్కడ ప్రకృతి స్త్రీకి తోడుగా ఉండి రాజ్యం సుభిక్షంగా ఉంటుందన్నారు. కొన్ని రంగాల్లో మహిళలు దూసుకుపోతూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న ప్పటికి ఎక్కడో ఒక చోట వివక్షత ఎదుర్కొంటూనే తెలిపారు.

వైసీపీ నేతల భూకబ్జాలు

విశాలాంధ్ర-పెనుగొండ: వైసిపి అరాచక పాలనలో స్థానిక నేతల నుండి ఎమ్మెల్యే స్థాయి వరకు భూకబ్జాలు ,ఇళ్ల పట్టాల అమ్ముకుంటూ అవినీతికి పాల్పడుతున్నారని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మండిపడ్డారు. రామన్నపాలెం తామరాడ గ్రామాల్లో ప్రజల వద్దకు పితాని ఎన్నికల ప్రచార పాదయాత్రను నిర్వహించారు. అడుగడుగునా అధికార పార్టీ దురాగాతాలను ప్రజలు పితాని దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామన్నపాలెం ఒక్కటే కాదు ప్రతిగ్రామంలోనూ జగనన్న ఇళ్ల పట్టాలకు రూ.1లక్ష నుండి 1.లక్ష 50 వేలు అధికార పార్టీ నాయకులు వసూలు చేశారని దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలని అన్నారు . ఇటువంటి దుర్మార్గపు శాసనసభ్యులను కొనసాగించడం అవసరమా అంటూ ప్రశ్నించారు. అవినీతికి అక్రమాలకు పాల్పడుతున్న వారికి అండగా నిలుస్తున్న స్థానిక శాసనసభ్యుడు రంగరాజును ఏం అనాలో అని ప్రశ్నించారు. తక్షణమే జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ ఈ విషయాల్లో జోక్యం చేసుకొని సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని అవసరమైతే వీరిని కొమ్ము కాస్తున్న శాసనసభ్యుడు పై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెలిచేటి బాబు రాజేంద్రప్రసాద్ ,సెక్రెటరీ గుత్తుల లోకేష్ కుమార్, జనసేన మండల అధ్యక్షులు కొండవీటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రామోజు శివప్రసాద్, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు వెంగళదాసు దానయ్య, ఆచంట జడ్పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, పెనుగొండ మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బడేటి బ్రహ్మాజీ, ఎంపీటీసీ మోహమట్ల కృష్ణకాంత్ ,టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు పేరాబత్తుల వెంకటేశ్వరరావు , జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు గంట్రోతు సురేష్ , చుక్కా విమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్

విశాలాంధ్ర-భీమడోలు: భీమడోలు మండలంలోని అంబరుపేట, కురెళ్లగూడెం, లింగంపాడు గ్రామాల్లో పారా మిలటరీ ఫోర్స్, పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా భీమడోలు సీఐ బిబి రవికుమార్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్టు, ప్రశాంత వాతావరణంలో గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని సిఐ తెలిపారు. భీమడోలు ఎస్ ఐ వై.సుధాకర్, ఏఎస్ఐ చలపతిరావు, హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర, కానిస్టేబుల్స్, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

శివాలయాలను దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర-నరసాపురం: శివరాత్రి పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం తెల్లవారుజామున నుండే భక్తులు గోదావరి లో స్నానాలు ఆచరించారు. పట్టణంలోని అమరేశ్వర స్వామి,కపిల మల్లేశ్వరస్వామి, లక్ష్మణేశ్వరంలోని దుర్గా లక్ష్మనేశ్వర స్వామి ఆలయాలు రద్దీగా ఉన్నాయి.నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ దుర్గా లక్ష్మణేశ్వర స్వామి వారిని రాష్ట్ర చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు దర్శించుకున్నారు.స్వామివారి పల్లకి ప్రదక్షిణ,స్వామివారి రథోత్సవ కార్యక్రమాన్ని గుమ్మడికాయ ప్రసాదరాజు ప్రారంభించారు.మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు,మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు , టీడీపీ నాయకులు కొవ్వలి రాంమోహన్ నాయుడు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయాలు వద్ద భక్తులకు ఎటువంటి ఆటంకాలు జరగకుండా రూరల్ సీఐ కె.గోవిండ్ రాజు ,పట్టణ సీఐ కె ఎ. స్వామి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ప్రజలందరిపై మహాశివుని సంపూర్ణ ఆశీస్సులుండాలి

విశాలాంధ్ర -పెదవేగి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ మాజీ విప్, దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సతీ సమేతంగా ఏలూరు జిల్లా ముసునూరు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం బలివే ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలోని శ్రీరామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ "లయకారుడిగా, భోళా శంకరుడుగా భక్తుల పూజలు అందుకునే ఆ పరమ శివుని అత్యంత విశిష్టత కలిగిన ఈ మహాశివరాత్రి రోజున బలివే క్షేత్రంలో వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామినీ అర్చించి, ప్రజల అందరిపై ఆయన ఆశీస్సులు ఉండాలని కోరినట్లు తెలిపారు. బలివే శైవ క్షేత్రం ఎంతో ప్రాముఖ్యత కలిగినదని, స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని విధాలా చర్యలు చేపట్టాలని చింతమనేని ప్రభాకర్ కోరారు.అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు చింతమనేని ప్రభాకర్ స్వయంగా ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పెదపాడు మండల అధ్యక్షులు లావేటి శ్రీనివాస్, క్లస్టర్ ఇంచార్జీ బొడ్డేటి మోహన్, ఎంపిటిసి (సత్యవోలు) రంభా నాగరాజు, పి.వీరాంజనేయులు సహా పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధి చెందాలి

విశాలాంధ్ర-కాళ్ల : పురుషులతో పాటు అన్ని రంగాలలో సమానంగా మహిళలు అభివృద్ధి చెందాలని ఉండి నియోజకవర్గ శాసనసభ్యులు మంతెన రామరాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని తన కార్యాలయంలో ఉండి జనసేన ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజుతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మహిళలను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ మహిళలకు సమానత్వం, గౌరవం,ఆర్థిక పరిపుష్టి కల్పించినప్పుడే దేశం అభివృద్ధిలో నడుస్తుందని తెలియజేశారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని ఏ ఆడబిడ్డ కూడా చదువుకు సంబంధించిడబ్బులు కొరతతో ఇంటికి పరిమితం కాకూడదనే ఆలోచనతో కలలకు రెక్కలు అనే,నూతన పథకాన్ని తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తో కలిసి సంయుక్తంగా ఆవిష్కరించినట్లు ఆయన వివరించారు. తమ కలలతో రాజీ పడకుండా వారి లక్ష్యాలను చేరుకునే దిశగా ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలియజేశారు.మహిళలకు వృత్తిపరమైన విద్యుత్ తో పాటు ఉపాధి అవకాశాలు ఎన్నో కల్పించిన ఘనత నారా చంద్రబాబుకే దక్కిందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ పథకం కింద నమోదు చేసుకున్న మహిళలకు బ్యాంకు లోను ప్రభుత్వమే బాధ్యత వహించి ఇస్తుందని, రిజిస్ట్రేషన్ కోసం వెబ్సైట్ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, తెదేపా కార్యకర్తలు జనసేన కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తేదేపాతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-మండవల్లి: తేదేపా తోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ కన్వీనర్ కొడాలి వినోద్ పేర్కొన్నారు. శుక్రవారం కానుకొల్లు గ్రామం నుండి ధర్మ పోరాట పాదయాత్ర ప్రారంభించి స్వయంగా పాల్గొన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేసి మహిళలకి సన్మానం చేసి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి పాదయాత్ర ప్రారంభించారు.

ఈ సందర్భంగా కొడాలి వినోద్ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల్లోకి ధర్మ పోరాట పాదయాత్ర ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో మూడు రోజులు పాటు పాదయాత్ర గ్రామంలోని గొలుసుమశాన వాటికల గురించి, రహదారుల మరమ్మతులు, నేటి సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చినట్లు టిడిపి అధికారంలోకి రాగానే అన్ని సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో వీరమల్లు నరసింహారావు, పెనుమత్స త్రినాధ్ రాజ్, బి కే యం నాని, భలే ఏసు రాజు, గజ్జల గణేష్,పూల రాజి,చాబత్తిన విజయ్, పళ్లెం ఏడుకొండలు, పంతగాని సురేష్,కందేపి పద్మ, దారం సుధా, శీలం కృష్ణవేణి, వీరవల్లి శివయ్య, వీరబత్తిన సుధా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుండలేశ్వరుని దర్శించుకున్న మంత్రి విశ్వరూప్

విశాలాంధ్ర - కాట్రేనికోన : శివరాత్రి సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రం కుండలేశ్వరంలోని గౌతమి నదీతీరంలో భక్తులు పెద్ద సంఖ్యలో పుణ్యస్నానాలు చేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు పినిపే విశ్వ రూప్ కుండలేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సంద ర్భంగా మంత్రిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయంలో పూజలు, అభిషేకాలు చేశారు. మంత్రి వెంట అమలాపురం జడ్పీటీసి పందిరి శ్రీహరి, పార్టీ జిల్లా యువజన ఉపాధ్యక్షులు అక్కల శ్రీధర్, గోకర కొండ సత్తిబాబు, మండల వైసీపీ అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి, నియో జవర్గ సోషల్ మీడియా గిడ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మాగసాని తిప్పదీవిలో కాలభైరవ స్వామిని భక్తులు దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. నడవపల్లి, కాట్రేనికోన, పల్లంకురు, కందికుప్ప, చెయ్యరు దేవాలయాల్లో భక్తులు దైవ దర్శనం చేసుకున్నారు.

మహిళా సాధికారత దిశగా టీడీపీ ముందడుగు

విశాలాంధ్ర - కొవ్వూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంద ర్భంగా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం తెలుగు మహిళా నాయకుల ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు టౌన్ మహిళా అధ్యక్షులు ఇమ్మని శిరీష మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం -జనసేన ప్రవేశ పెట్టిన కలలకు రెక్కలు అనే సరికొత్త పథకం ద్వారా మహిళా సాధికారత దిశగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మరో కీలక ముందడుగు వేశారని కొనియాడారు .ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఏ ఆడబిడ్డ కూడా ఇంటికి పరిమితం కాకూడదని ఆలోచనతో ఈ పథ కాన్ని తీసుకొచ్చారని మాట్లాడారు. ఏడవ వార్డ్ కౌన్సిలర్ పాలూరి నీలిమ మాట్లాడుతూ మహిళలు వృత్తి పరమైన విద్యకు మార్గాలను అందించటం తోపాటు వారికీ మరింత ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ పథకం ముఖ్యఉద్దేశ్యమని, చంద్రబాబు నాయుడు-పవన్ కళ్యాణ్ మహిళపై అపార గౌరవం చూపిస్తారని అన్నారు. 2024 జూన్‌లో టీడీపీ -జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పారు. ఖండభట్టు విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ పథకానికి అర్హులైన మహిళలందరూ దేశంలో ఎక్కడైనా తమకు నచ్చిన ప్రొఫెషనల్ కోర్సులను అభ్యసించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డ్ కౌన్సిలర్ కిలారీ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో స్త్రీపాత్ర కీలకం

విశాలాంధ్ర - సీతానగరం : మహిళ సాధికారిత సాధించడమే లక్ష్యం గా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జడ్పీటీసీ చలమల వెంకటలక్ష్మి అన్నారు. మండలంలో కాటవరం గ్రామంలో సంజివపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాలలో శుక్రవారం మహిళాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి మండల యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రావణి అధ్యక్షతన జడ్పీటీసీ వెంకటలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీనిలో పలువురు సీనియర్ ఉపాధ్యాయురాలను సన్మానించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజ అవిర్భావం నుంచి నేటి వరకూ సమాజంలో స్త్రీ పాత్ర కీలకమైందని అన్నారు. ప్రతీ మహిళ తన బాధ్యతలతో పాటు తన వ్యక్తి గత ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాపారావు, దేవ వాణీ, సర్పంచ్ సత్య వేణి, జగదీశ్వరి, నాగమణి తదితరుల పాల్గొన్నారు.

ఉచితకుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర- దేవరపల్లి: మండలం లోని పల్లంట్ల గ్రామం లోని షాలోమ్ సేవా సంస్థ అధ్యక్షులు ఈదూరి డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో యూసీఎం డైరెక్టర్ బిషప్, డాక్టర్ సంతోష్‌బాబు దేశభక్తుల వారి సహకారంతో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభించారు. ఈ శిక్షణా కేంద్రంలో శ్రీమతి స్వర్ణలత జడ్పీటీసీ సభ్యురాలు తన సందేశంలో సృష్టికి మూలము ఆత్మీయతకు మారుపేరే మహిళ అని కొనియాడారు. అధ్యక్షులు డేవిడ్‌రాజు 20 మందికి గ్రేస్ టైలరింగ్ ఇన్స్టిట్యూట్స్ అప్లికేషన్స్ ఇచ్చి జాయిన్ చేసుకున్నారు. అనంతరం జడ్పీటీసీ, మాజీ ఎంపీటీసీ సభ్య రాలు రాయుడు. సూరేకాంత చిన్నం. శాంతి కుమారి ఈదురి. జెస్సి సాల్వా పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ ఈ.సంతోష్ కుమార్ ఈ. శివ, మండపాటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని పలు గ్రామాలతో పాటు గా స్థానిక సమతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో శుక్రవారం సమత మహిళా పొదుపు సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సీనియర్ మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ మేరకు సమత ఎన్జీవో కోఆర్డి నేటర్ శ్యామ్ మాట్లాడుతూ సమత ఆధ్వర్యంలో గత 27 సంవత్సరాలుగా అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను జరుపుకుంటున్నామని, సమాజంలో మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని అధిగమించడానికి అందరూ సంఘటితంగా కలిసి పనిచేయాలని, మహి ళలు సాంఘికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మాజీ ఎంపీపీ వనం లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యులు వాసంశెట్టి దుర్గాభవాని, ఉండమట్ల విజయ కుమారి, సమతా సభ్యులు రామకృష్ణ, రాముడు, కే వరలక్ష్మి, ఎస్ వరలక్ష్మి పాల్గొన్నారు.

చల్లాకు ఘన సత్కారం

విశాలాంధ్ర - ఆలమూరు : మండల కేంద్రమైన ఆలమూరుకు చెందిన వైసీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి, డాక్టర్ చల్లా ప్రభాకరరావు మండపేట నియోజవర్గ పరిశీలకులుగా భాద్యతలు స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం మండపేటలో జరిగిన వైసీపీ సమావేశంలో పాల్గొని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. సీఎం వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ ప్రచారం చేయాలని సూచించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ పని చేయాలని కోరారు. నియోజక ఇన్చార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును రికార్డు స్థాయి మెజారిటీతో గెలిపిం చాలని కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు, మండపేట మున్సిపల్ చైర్మన్ పతివాడ నూక దుర్గారాణి ఆధ్వర్యంలో నియోజక వర్గ పరిశీలకుడు చల్లాను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంద ర్భంగా చల్లా పలువురు మహిళా నాయకులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : మహిళలు అన్ని రంగాల్లో రాణిం చినప్పుడే రాష్ట్రంలో పూర్తి స్థాయి మహిళా సాధికారిత సాధ్యపడు తుందని పులిమేరు శాంతివర్దనా విభిన్న ప్రతిభావంతుల పాఠశాల ప్రిన్సిపాల్ రాయవరపు సత్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినో త్సవం పురష్కరించుకుని మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవ సరం ఉందన్నారు. పాఠశాల వ్యవస్థాపకుడు వీరబాబు, ప్రిన్సిపాల్ ఆర్ సత్యవేణిలు మాట్లాడుతూ అందరి సహకారంతోనే విభిన్న ప్రతి భావంతుల విద్యార్థులకు వసతులు కల్పించడం జరుగుతుంద న్నారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది. ఆయాలు కలిసి ప్రిన్సిపాల్ సత్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ శాంతి వర్దన్, ఆర్ చంటి, వేణు, అప్పలరాజు, శివ, శ్రీనివాస్, సరోజిని, విశాల, ఫణీంద్ర విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

(కెకెడి 8-3- 2024, కెకెడి పిహెచ్ 22 :

కాంగ్రెస్‌లో మహిళాభ్యుదయానికి అధిక ప్రాధాన్యత : పీసీసీ

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : మహిళలకు కాంగ్రెస్ పార్టీ ద్వారానే స్వేచ్ఛ లభించిందని పీసీసీ అధికార ప్రతినిధి గెడ్డం సురేష్‌బాబు అన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరు లతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై రోజు రోజుకు అఘాయత్యాలు పెరిగి పోతు న్నాయని జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళాభ్యదయానికి అధిక ప్రాధాన్యత కల్పించిందన్నారు. 1975 సంవత్సరంలోనే ద్వాక్రా పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టి మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యత కల్పించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ అభయహస్తం పథకంక్రింద ప్రతీ నిరుపేదకు నెలకు రూ.5000లు ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. వంటగ్యాస్ రూ. 500లకే ఇస్తారని, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్క రిస్తారని ఆయన అన్నారు. మహిళలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి అధికారంలోకి తెస్తే మహిళలకు నిజమైన స్వేచ్ఛ లభిస్తుందన్నారు.

దాతృత్వాన్ని చాటిన నవభారత్ ఫౌండేషన్

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రజారోగ్య పరిరక్షణలో మేము సైతం ఉన్నామంటూ నవభారత్ లిమిటెడ్ ఫౌండేషన్ తమ దాతృ త్వాన్ని చాటుకున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి సంస్థ ఫౌండర్ ఏఎస్ చౌదరి పేరు మీదగా సుమారు రూ. 8 లక్షల విలువచేసే సామాగ్రిని గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి అంద జేశారు. ఈ సందర్భంగా సమాజిక ఆరోగ్య కేంద్రం సూపర్టెండెంట్ డాక్టర్ చైతన్య రాజు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం నవభారత్ లిమిటెడ్ ఫౌండేషన్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి అవసరమయ్యే ఎయిర్ కండిషన్, వాషింగ్ మిషన్, ఆఫీస్ ఫర్నిచర్, కంప్యూటర్స్, ఈసీజీ మిషన్, చైర్స్, 23 రకాల సామాగ్రిని అందజేశారని తెలి పారు. ప్రభుత్వ ఆసుపత్రి నందు అవసరమయ్యే సామాగ్రిని దాతృ త్వంతో అందజేయడంతో కొరత తీరినట్లు ఆయన తెలిపారు. నవభారత్ లిమిటెడ్ ఫౌండేషన్ వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అత్తిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కర్ రావు,ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, వెలగా శ్రీరామమూర్తి, సర్పంచ్‌లు ధనలక్ష్మి, పైడి శిరీష, మడిచర్ల ప్రసాద్, ఆన్సర్ భాష, అసిస్టెంట్ మేనేజర్ లీలాకృష్ణ, ఏరియా మేనేజర్ అనిశెట్టి వీర్రాజు. వైద్యులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తూరంగేశ్వర స్వామి ఆలయంలో విశేషపూజలు

విశాలాంధ్ర - కాకినాడ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కాకినాడ రూరల్ నియోజకవర్గం తూరం గి గ్రామంలో వెలిసిన తూరంగే శ్వర స్వామి ఆలయంలో శు క్రవారం తెల్లవారుజాము నుండి విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బాబులు తెలియజేశారు. శివనామస్మరణతో తూరంగేశ్వర స్వామి ఆలయం మార్మోగింది కాకినాడ రూరల్ కాకినాడ నగరానికి చెందిన వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బాబులు మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా వేలాది భక్తులు తెల్లవారు జాము నుండి విశేష సంఖ్యలో భక్తులు వచ్చారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశానుసారం క్యూ లైన్ పద్ధతి ద్వారా స్వామివారి దర్శనానికి అనుమతించారని అన్నారు.

టీడీపీ, జనసేనలకి అండగా నిలవాలి

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం నియోజకవర్గ తెలుగు మహిళాఅధ్యక్షురాలు సంసాని లక్ష్మీ గౌరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన పార్టీల మేనిఫెస్టోలో మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. వచ్చే ఎన్నికలలో మహిళలందరూ తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ గనిసెట్టి నాగలక్ష్మి, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, తదితర తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన మహిళ నేతలను కార్యకర్తలను పెచ్చెట్టి విజయలక్ష్మి, సంసాని లక్ష్మీ గౌరీ సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మహిళా సాధికారత టీడీపీ జనసేన ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ ప్రతిపాదు నియోజకవర్గ ఇన్చార్జ్ వరుపుల సత్యప్రభ అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఏలేశ్వరం ఆరోవ వార్డులో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా సత్యప్రభ విలేకరులతో మాట్లాడుతూ టిడిపి జనసేన మేనిఫెస్టోలో నూతనంగా ప్రవేశపెట్టిన పథకంతో మహిళలు బ్యాంకు రుణం పొంది దేశంలో ఎక్కడైనా చదువుకునే అవకాశం ఉందన్నారు. చదువు పూర్తయ్యే వరకు రుణానికి వడ్డీ ప్రభుత్వం భరిస్తుందని దీంతో తెలుగింటి ఆడబిడ్డ నచ్చిన ప్రొఫెషనల్ కోర్సు చదువుకుని బంగారు భవిష్యత్తు ఏర్పరచుకోవచ్చు అని అన్నారు. అనంతరం ఆరోవ వార్డుకి చెందిన సుమారు 30 కుటుంబాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి టిడిపిలో చేరారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి సత్య ప్రభ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపికి చెందిన మహిళలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే మహిళా సాధికారత

విశాలాంధ్ర - ఏలూరు: ఉద్యమాల ద్వారానే మహిళా సాధికారిత సహకారం అవుతుందని మాజీ కార్పొరేటర్ జాలా సుమతి బాలాజీ అన్నారు. స్థానిక 3వ డివిజన్ లో ఉన్న మదర్ తెరిసా విగ్రహం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మదర్ తెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుమతి బాలాజీ మాట్లాడుతూ మహిళా సాధికా రతతోనే సమాజ సాధికారత సాధ్యమని, అందుకు మనం ఇంకా కృషి చెయ్యాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళలు తమ లక్ష్యాలను చేరుకోవటానికి, తమ కలలను సాధించుకోవటానికి పాలకులు ప్రోత్సహించాలన్నారు.అన్ని రంగాలలో పురుషులతో సమానంగా మహిళలను కలుపుకుని వారిని సాధికారత దిశగా నడిపించాలని ఉద్ఘాటించారు. తేదేపా ఎస్ సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తితో రాణించాలన్నారు. తల్లిదండ్రులు మంచి వివేచనతో ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా ప్రయోజకులుగా తీర్చి దిద్దాలన్నారు. ప్రభుత్వాలు మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని చెప్పడమే కాకుండా ఆచరణలో చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయ కురాలు షేక్ రిజ్వానా సుల్తానా బేగం, వీరబత్తిన వనిత, ఉప్పు వరలక్ష్మి, సేవాదళ్ సీనియర్ నాయకురాలు జాలా శారదా దేవి, గుంటూరు ఈశ్వరమ్మ, కొత్తలంక తులసి, మాతంగి రమణమ్మ, శంక సీత, జే అరుణ, జె.లక్ష్మి, జె. అనురాధ, వీరభత్తుల నిర్మల, సునీత, చాగంటి దేవ కుమారి, చనపతి లక్ష్మి, సరిపెల్లి ఆదిలక్ష్మి, ప్రసన్న, ఎస్ కె మున్ని, ఇంటి పార్వతి, ఓసా సుజాత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో పురోగమించాలి

విశాలాంధ్ర - ముదినేపల్లిలో : మహిళలు అన్ని రంగాల్లో పురోగమించాలని, వారి సాధికారత కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్షు రాలు సాయిచందు అన్నారు. ముదినేపల్లి తహసిల్దార్ ఎస్ ఎల్ ఎన్ కుమారిని యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం సభ్యులు ముదినేపల్లి ఏఎస్ఐ పద్మజాను జిల్లా ఎస్పీ డి. మేరీ ప్రశాంతి , ఎఎస్పి స్వరూపారాణి ఘనంగా సత్కరించారు. మండలంలోని విద్యా శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలైన ఉపాధ్యాయినిలకు ఎంఈఓ నరేష్ కుమార్ బహుమతులు అందజేశారు. శ్రీహరిపురంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయు లను, అంగన్వాడి కార్యకర్తలను యుటిఎఫ్ మండల అధ్యక్షురాలు సాయిచందు, సాయిలక్ష్మి , ఉపాధ్యాయినిలు శాలువాలతో, పూలదండలతో సత్కరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

విశాలాంధ్ర - దేవరపల్లి : ఆపదలో ఉన్న వారిని తమ ప్రభుత్వం ఎల్లప్పుడు ఆదుకుంటుందని రాష్ట్ర హెూం శాఖ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు దేవరపల్లి మండలం కృష్ణ పాలెం గ్రామానికి చెందిన పెనుగొండ శివకుమార్కు లివర్ మార్పిడి నిమిత్తం సీఎం రిలీఫ్ పండు కోసం దరఖాస్తు చేయగా స్పందించిన ప్రభుత్వం శు క్రవారం పది లక్షల రూపాయల ఎల్‌వోసిని అందజేశారు. ఈఎల్‌వోసిని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత కుటుంబ సభ్యులకు అందజేశారు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఉద్దే శంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాధితులను ఆదుకోవడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్ ఎంపిటిసి సత్తి జగదీశ్వర్ రెడ్డి వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్తి సాయి ఈశ్వర్ రెడ్డి మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ దాసరి సత్యనారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిర ప్రతిష్ట



విశాలాంధ్ర-దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా, దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామంలో లైట్‌హౌస్ బాప్టిస్ట్ ప్రార్థనా మందిర ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి లైట్ హౌస్ మినిస్ట్రీస్ అధినేత రెవ. డాక్టర్ మల్లిపూడి డేవిడ్ రాజు, బుల్లెమ్మాయి ముఖ్య అతిథులుగా పాల్గొని మందిర ప్రతిష్ఠ చేశారు. ఈ సేవా పరిచర్యను తమ తండ్రి కీ.శే. రెవ. ఎమ్.ఐజాక్ 1980లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవ. కె. నవజీవన్ రాజు, చాగల్లు పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు డాక్టర్ నాని, ఇతర సేవకులు, విశ్వాసులు, వృద్ధులు పాల్గొని క్రీస్తును ఆరాధించారు.

ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - దేవరపల్లి:

మండలంలో మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలలో హర హర మహాదేవ శంభో శంకర ఓం నమశ్శివాయ నినాదాలతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. దేవరపల్లిలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం షిరిడి సాయినాథ్ ఆలయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం శ్రీకృష్ణ ఆలయం దేవరపల్లి మండలం పల్లంట్ల లో గల శ్రీ రాజరాజేశ్వరీ సమేత దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో కురుకూరు శివాలయం లక్ష్మీపురం హరిహర క్షేత్రం రామన్నపాలెం త్యాజంపూడి కృష్ణం పాలెం చిన్నాయగూడెం యాదవోలు గ్రామాలలో శివాలయాలలో తెల్లవారి జాము నాలుగు గంటల నుండి భక్తులు బారులు తీరి దైవ దర్శనం చేసుకు న్నారు. దేవరపల్లి ఉమా రామ లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషే కాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

విశాలాంధ్ర - పిఠాపురం :

మహాశివరాత్రి పురస్కరించుకొని పిఠాపురం పాదగయా క్షేత్రం భక్తులతో కిటకిట లాడింది. పిఠాపురం స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా పిఠాపురం స్టేట్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ మహాశివరాత్రి పుర స్కరించుకొని ప్రతి సంవత్సరం మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామని, అదే విధంగా ఈ సంవత్సరం కూడా ఏర్పాటు చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది శ్రీరామ్, ఉజ్వల, మురళి, చిన్న పాల్గొన్నారు.

విశాలాంధ్ర - రౌతులపూడి :

మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని శివాల యాలు భక్తుల శివనామస్మరణతో మారుమ్రో గాయి. మండలంలోని శృంగవరం, రౌతులపూడి, గంగవరం గ్రామాలలోని శివాలయాలలో అధిక సంఖ్యలో భక్తులు శివుని దర్శించి భక్తిప్రపత్తులతో పూజలు నిర్వహించారు. శివాలయాలన్నీ మహాశివ రాత్రి పర్వదినం కావడంతో భక్తులు కుటుంబాలతో సహా శివుని దర్శించుకుని తరిం చారు. ఆయా శివాలయాల కమిటీ వారు భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగ కుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

విశాలాంధ్ర - నల్లజర్ల :

నల్లజర్ల మండలం అనంతపల్లిలో మహాశివరాత్రి సందర్భంగా అనేక మంది శివాలయాల్లో పూజలు నిర్వహించి మహా శివుని దర్శనాన్ని అందుకున్నారు. ఆ గుడి ప్రాంగ ణం అంతా కూడా జనాలతో కిక్కిరిసిపోయింది

విశాలాంధ్ర - కొవ్వూరు : గోదావరి ఒడ్డున ఉన్న గోష్పాద క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. శుక్రవారం శివరాత్రి సందర్భంగా గోదావరిలో ఉదయం తెల్లవారు జామున మూడు గంటల నుంచి భక్తులు చేరుకొని పుణ్యస్నాలు ఆచరించి క్షేత్రంలో కొలువైన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత సుందరేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతులకు అభిషేకాలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా గోపాలపురం ఎమ్మెల్యే కొవ్వూరు వైకాపా ఇన్చర్జ్ తలారి వెంకట్రావు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కొవ్వూరు డీఎస్పీ, ఏసి హెచ్ రామారావు ఆధ్వర్యంలో పట్టణ సీఐ జగదీష్ కుమార్ తదితరులు బందోబస్తు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూశారు.

విశాలాంధ్ర - కరప : హర హర మహాదేవ శంభో శంకర అంటూ కరప మండల శివాలయాలల్లో భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరిం చుకొని శుక్రవారం తెల్లవారుజామున శివభక్తులు పుణ్య స్నానాలు ఆచరించి దేవాల యాలలో శివునికి విశేషంగా పూజలు జరిపించారు. కరప శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈవో తిరుమల రవితేజ భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేసి తీర్థప్రసాదాలు అందించారు. ఉప్పలంక, చొల్లంగి, వేములవాడ, కూరాడ, వేలంగి, నడకుదురు అరట్లకట్ట, తదితర గ్రామాలలో మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. కరప ఆలయ పూజారులు భక్తులకు గోత్రనామాలు చెప్పి అర్చనలు చేశారు. సదానంతరం తీర్థప్రసాదాలు అందించారు.

విశాలాంధ్ర - ఏలేశ్వరం :

పట్టణంలో మహాశివరాత్రి సందర్భంగా పవిత్ర యాలానది ఒడ్డున ఉన్న శ్రీ రాజ రాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవాలయం శుక్రవారం తెల్లవారు జాము నుంచి భక్తులతో కిటకిటలాడింది. భక్తులు తెల్లుంలవారుజాము నుండి శివాల యమునకు చేరుకుని పవిత్ర యలా నదిలో స్నానమాచరించి, పరమేశ్వరుని దర్శించు కుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. శివాలయం ప్రక్కనే నిరంతరం నదీ ప్రవా హం ఉండడంతో ఈ ఆలయమును మరొక కాశీ వలె భావించి ఆలయానికి చుట్టు పక్కన ఉన్న గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలి రావడం ఆనవాయితీ. శివరాత్రి సందర్భంగా భక్తులకు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు. శివరాత్రి సందర్భంగా పలువురు దాతలు అన్న సమరాధన, మజ్జిగ పంపిణీ, పులిహోర, బిర్యానీలు భక్తులకు పంపిణీ చేశారు.